జగత్తుకు మూలాధారశక్తి బ్రహ్మమే!

మనసునందు మంచి మాటలందున మంచి
నడతలందు మంచి పొడమకున్న
సాయి మిమ్ము మెచ్చి సంతోషమెటులిచ్చు
శాంతి ప్రేమదాయి సత్యసాయి

మాటలందు తీపి మనసులో చేదుంచ
మంచికాదు మీకు మచ్చగాని
మచ్చలేని బ్రతుకె మహిలోన చెల్లురా
విద్యలందు ముఖ్యవిలువ యిదియె

విద్యార్థులారా! నిత్యజీవితములో నిత్యమైన సత్యాన్ని గుర్తించవలెనన్న మానవునకు ప్రత్యక్ష ప్రమాణములు శరీరము, యింద్రియము, మనస్సు, బుద్ధి. వీటి రహస్యమును గుర్తించుకున్నప్పుడే వాటిని యేవిధముగా వుపయోగించుకోవాలనే విషయము మనకు అర్థమవుతుంది. జగత్తులో నూటికి తొంభైతొమ్మిదివంతుమంది వీటి రహస్యమును గుర్తించక వర్తించటముచేతనే అనేక దుఃఖములకు, విచారములకు, కష్టములకు గురి అగుచున్నారు. ఈ దేహము, యింద్రియములు, మనస్సు, బుద్ధి, జీవులకు వుపాధులేగాని, యివి చైతన్యవంతమైనవి కాదు.

పంచ భూతములు సత్ చిత్ ఆనందమునుండి ఆవిర్భవించినవే!

దేహము కేవలము జడము. ఇది రక్త మాంసములతో కూడిన ముద్దగా పుట్టి, బాల్యమునందు కోమలముగా రూపొంది, యవ్వనమునందు సౌందర్యమును అనుభవించి, వృద్ధాప్యమునందు వికారమును పొందుతుంది. ఈ మార్పులను పురస్కరించుకొని మానవుడు దేహమును చైతన్యవంతమైనదని, దేహము జడముకాదని భావిస్తున్నాడు. అయితే ఈ మార్పులకు దేహముకాదు, కారణము. దేహము జడము మాత్రమే! దీనికి చక్కని ఉదాహరణము. నిత్యము

sri sathyasai vahanamrutam

మనము గృహమును వూడ్చి ఆ చెత్తను ఒక గుంతలో వేస్తూ వుంటాము. ఈ విధముగా కొన్ని మాసములు వేసినప్పుడు అది ఒక పెద్ద దిబ్బగా తయారౌతుంది. పెద్ద దిబ్బగా వుండినంత మాత్రమున దీనికి చైతన్యమున్నదనా అర్థము? కాదు, కాదు. దేహముకూడా అటువంటిదే. మనము యిడ్లి, దోసె మొదలగు వానిని దేహమునకు ఆహారముగా వేసినప్పుడు అది దిబ్బవలే పెరుగుతుంది. కొంతకాలము దీనికి ఆహారము వేయకుండా చూడు. ఈ దేహము పెరుగదు. క్షీణిస్తుంది. కనుక

పొట్టచూడ మలమూత్రముల గుంత
దేహము చూడ కంపుగొట్టే దిబ్బ
ఆత్మకు యిదియే అద్దె కొంప

వేదాంతమునందు 'దేహోదేవాలయ ప్రోక్తో జీవోదేవస్సనాతనః' అని చెప్పబడింది. ఇది కేవలము ఒక rented house. అయితే యింద్రియములు, మనస్సు, బుద్ధి యిత్యాది వుపాధులు ఏ విధమైన రీతిలో వృద్ధరించుచున్నవి, క్షీణింప చేయుచున్నవి అన్న విషయమును విచారించటము మంచిది. ఈ ప్రపంచమంతా పంచభూతముల స్వరూపము. అవియే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు. వీనినే ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి అన్నారు. ఇవి అన్నీకూడా సత్ చిత్ ఆనందములనుండియే ఆవిర్భవించినవి. వీనియొక్క స్వస్థానము సచ్చిదానందమే!

ఆకాశమన్నది ఒక పెద్ద పాత్ర. ఇందులోనే మిగిలిన నాలుగు భూతములు అనగా అగ్ని, గాలి, జలము, పృథ్వి యిమిడివున్నాయి. ఇవి ఒకదానికంటె ఒకటి సూక్ష్మమై వుంటాయి. పృథ్వికంటె జలము సూక్ష్మమై అతి విశాలముగా వుంటుంది. అందువలన అది పృథ్వికంటె తేలికగా వుంటుంది. జలముకంటె అగ్ని మరింత సూక్ష్మమైన స్వరూపమును ధరిస్తుంది. అగ్నికంటె గాలి మరింత సూక్ష్మరూపము ధరిస్తుంది. ఇది మరింత వ్యాపించి వుంటుంది. ఈ గాలికంటె ఆకాశము మరింత సూక్ష్మమై వుంటుంది. కనుకనే ఈ పంచభూతములైన ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి వీటిని పంచకోశములు ఆవరించి వుంటున్నవి. వీటిలో మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అంతర్లీనమై వుంటుంటాయి.

పంచభూతములకు ఆకాశమే మూలాధారము

srisathyasaivachanamrutam

ఆకాశములోపల అతిగతి అనేది ప్రారంభమవుతుంది. ఇది చలనము కలిగి వుంటుంది. ఈ చలనమన్నది గాలిగా రూపొంది దీనినుండి వేడి ప్రారంభమవుతుంది. కదలికచేత వేడి ప్రారంభమవటము వైజ్ఞానికముగా మనకు తెలిసినదే! చేతులను ఒకదానితో ఒకటి గట్టిగా రాపిడి చేస్తే దానిలో వేడి ప్రారంభమవుతుంది. గాలివలనే ఉష్ణము వృద్ధిపిస్తుంది. ఉష్ణము అభివృద్ధి కావాలంటే గాలి అత్యవసరము. ఈ ఉష్ణము చల్లబడినప్పుడు అదే నీరుగా మారుతుంది. ఆ నీరు ఘనీభవించినప్పుడు పృధ్విగా రూపొందుతుంది. కనుక ఈ పంచభూతములకు మూలాధారమైనదే ఆకాశము. ఇవి కేవలము లోకోద్ధార నిమిత్తము ఏర్పడినవే కాక, సర్వజ్ఞత్వమైన దైవత్వమును నిరూపించటములో యివి ప్రమాణముగా వుంటున్నవి. యింక మనో, బుద్ధి, చిత్త, అహంకారములు. అహంకారము ప్రాణముతోకూడి వుంటుంది. దీనికి విజ్ఞానమయకోశము నిలయము. మనస్సు చిత్తముతో చేరివుంటుంది. ఇది మనోమయకోశము. ఏతావాతా జీవునకు, ప్రాణికి మధ్య మనస్సు చేరివుంటుంది. మనస్సునకు, దేహమునకు మధ్య ప్రాణము చేరివుంటుంది. ఏతావాతా మనస్సుకుపైన బుద్ధి చేరివుంటుంది. ప్రాణము క్రిందన వుంటుంది. ఈ బుద్ధి, ప్రాణము అగ్నిమయము. ఈ రెండు అగ్నిమయమైన రూపములు దేహమున చేరి వుండటముచేతనే దేహముయొక్క ఉష్ణస్థితిని కాపాడుతున్నవి.

మనస్సునకు అధిష్టాన దేవత చంద్రుడు

మనస్సును మనము అల్పమైనదిగా భావించరాదు. మనస్సే ఈ ప్రపంచము. మనస్సే ఈ మనిషి. కనుక మనస్సును మనము అతిజాగ్రత్తగా గుర్తించటానికి ప్రయత్నించాలి. పైన బుద్ధి, క్రింద ప్రాణము. ఈ రెండు అగ్నిమయము కావటముచేత మధ్యనున్న మనసు కరిగిపోతుంటుంది. మనస్సునకు అధిష్టాన దేవత చంద్రుడు. చంద్రుడు చల్లదనము. కనుకనే జలము చల్లగా వుండి కరిగే నీరుగా వుంటుంది. నీరు ఎక్కడ పోసినాగాని క్రిందికే దిగుతుందిగాని పైకిపోదు. అగ్ని ఎక్కడ పెట్టినాగాని పైకే పోతుందేగాని క్రిందికి దిగదు. మనిషిలో మనస్సు వుండటముచేత విషయసంబంధమైన వాసనలందే దిగజారిపోతుంది. అట్టి అధోగతికి దిగజారే మనస్సును ఊర్ధ్వగతికి ప్రయాణము చేయునట్లు చూడాలి. మనస్సు, బుద్ధి, చిత్తము,

srisathyasai vachanamrutam

అహంకారము, పంచభూతములు ఇవన్నీ ఎక్కడనుండి పుట్టాయి? ఇవన్నీ సచ్చిదానందమనే మూలస్థానమునుండే ఆవిర్భవించాయి. ఎట్లనగా ప్రజ్వరిల్లుచుండిన అగ్నిగుండమునుండి అనేక అగ్నికణములు బయలుదేరుతున్నవి. అదేవిధముగానే ఈ పంచభూతములు ఒకే సచ్చిదానందమునుండి అణురూపములుగా బయలుదేరుతున్నాయి. ప్రతి జీవికూడ తన జన్మస్థానమును గూర్చి విచారించిన, సచ్చిదానందమే తన జన్మస్థానముగా నిరూపణ అవుతుంది. దీనికి ఉదాహరణ. మనము దేహమును ధరించి, యింద్రియములను వరించి, మనస్సు భ్రమించి చిత్తములో మునగడముచేతనే మన యథార్థస్థానమును విస్మరిస్తున్నాము.

దేహమునకు మూల కారణము అజ్ఞానమే

ఈ దేహము రావడానికి మూలకారణము ఏమిటి? దీనికి మొట్టమొదటి స్థానము అజ్ఞానమే. అజ్ఞానమునుండి అవివేకము ప్రారంభమవుతుంది. అవివేకమునుండి అహంకారము వస్తుంది. అహంకారమునుండి ద్వేషము ప్రారంభమవుతుంది. ఈ ద్వేషమునుండి రాగము వుద్భవిస్తుంది. రాగముచేతనే కర్మలాచరిస్తున్నారు. కర్మాచరణమువలనే దేహము లభిస్తున్నది. కనుక ఈ దేహమునకు మూలకారణము అజ్ఞానమే! అజ్ఞానమనగా ఏమిటి? సత్యమును అసత్యముగా, అసత్యమును సత్యముగా భావించటమే అజ్ఞానము. మీకందరికి తెలుసు. మహాభారతమునందు పాండవాగ్రజుడైన ధర్మజుడు అతి ఉత్తమ స్వరూపుడని గుర్తించి మయుడు అతనికి రాజసూయ యాగ సమయమున ఒక పెద్ద భవనమును నిర్మించి యిచ్చాడు. దానినే మయసభ అన్నారు. ఈ మయసభ యొక్క చిత్రము యేమంటే నీరు వున్నచోట నీరు లేనట్లుగా, నీరు లేని ప్రదేశములో నీరు వుండినట్లుగా కనబడుతుంది. ఎక్కడ ద్వారము లేదో అక్కడ ద్వారము వుండినట్లుగా కనబడుతుంది. ద్వారము వుండినప్పుడు ద్వారములేనట్లుగా కనబడుతుంది. వున్నది లేనట్లు, లేనిది వున్నట్లు కనిపించటమే ఈ మయసభయొక్క మహత్తు. ఈ చిత్రమైన మందిరమును దర్శించే నిమిత్తమై దుర్యోధనుడు అందులోనికి ప్రవేశించాడు. అక్కడ ఒక కొలను కనబడింది. జలము వున్నది కదా అని అతడు వస్త్రములను పైకెత్తి పట్టుకుని ప్రవేశించాడు. కానీ, అందులో జలము లేదు. కొంచెము దూరము పోయేసరికి జలము వుండినా లేనట్లుగా కనిపించింది. చాలా వేగముగా, అహంకారముగా పోతూ ఆ గుంటలో పడ్డాడు. నిజానికి ఈ మయసభ

ఏమిటి?

ఈ విశ్వమే ఒక పెద్ద మయసభ. దుర్యోధన, దుశ్శాసనులే మన రాగ ద్వేషములు. దుశ్శాసనమనగా శాసనములను వుల్లంఘించేవాడు అని అర్థము. అతనికి శాసనమే లేదు. శాసనములు లేకుండా ప్రవర్తించటమువలననే అతనికి యిన్ని అవమానములు సంభవించాయి. తన శక్తి, సామర్ధ్యములను దుర్వినియోగము చేసినవాడే దుర్యోధనుడు. ప్రతి మానవునియందుకూడా ఈ దుర్యోధన, దుశ్శాసనులుంటున్నారు. మనకు జీవితములో కొన్ని నిబంధనలు వుంటున్నాయి. వానిని మనము అనుసరించినప్పుడే సరైన శాంతిభద్రతలను పొందుతాము. మన ఇన్స్టిట్యూట్‌లో రూల్సు అండ్ రిగ్యులేషన్సు ఏమిటి? మన హాస్టలు రూల్సు అండ్ రిగ్యులేషన్సు ఏమిటి? వీటిని చక్కగా గుర్తించి వర్తించినప్పుడే మనము విద్యార్థులమవుతాము. మన శక్తి, సామర్ధ్యములను దుర్వినియోగము చేయుటానికి పూనుకున్నప్పుడు మనము అబలులమైపోతాము. దుర్మార్గులుగా మారిపోతాము.

జగత్తునందు ఏ శక్తినికూడా మనము దుర్వినియోగము చేయరాదు

ఈనాడు మనము ఏమిటి దుర్వినియోగము చేస్తున్నాము? మన చూపులను దుర్వినియోగము చేస్తున్నాము. మన నాలుకను దుర్వినియోగము చేస్తున్నాము. మన శ్రవణమును దుర్వినియోగము చేస్తున్నాము. మన హృదయమును దుర్వినియోగము చేస్తున్నాము. మన హస్తమును దుర్వినియోగము చేస్తున్నాము. ఈ Misuse అంటే ఏమిటి? మానవుని యందున్న దివ్యశక్తిని అనగా energyని దుర్వినియోగము చేయటమే misuse. మనము శ్రవణము చేతను, actions చేతను అనేక విధముల శక్తిని దుర్వినియోగము చేస్తున్నాము. ఈ విధముగా శక్తిని దుర్వినియోగము చేయటమువలన దుర్యోధనులవుతున్నారు. ఈ దుర్యోధన దుశ్శాసనులకు కలిగిన ఫలితమేమిటి? పరాభవమే! అపజయమే! దుఃఖమే వారికి ప్రాప్తించింది. కనుక, ఈ జగత్తునందు ఏ శక్తినికూడా మనము దుర్వినియోగము చేయకూడదు. ఈ విధముగా దుర్వినియోగము చేయటమువలన దైవశక్తిని దుర్వినియోగము చేసినవారమవుతున్నాము. సముద్రము వుంటున్నది. ఈ సముద్రములో అనేక అలలు ప్రారంభమవుతూవుంటాయి. ఈ అలలలో నురుగు వుద్భవిస్తుంది. ఈ నురుగు అలలతో కూడుకొని వుంటుంది. అలలు

sri sathyasaivachanamrutam

సముద్రముతో కూడుకొని వుంటాయి. ఈ మూడు ఒకదానికొకటి వేరు కాదు. అదేవిధముగానే మానవుని యందు సత్త్వ, రజో, తమోగుణములు వుద్భవిస్తున్నవి. ఈ అన్నింటికిని ఆత్మయే ప్రధానమైన మూలస్థానము. ఈ ఆత్మ ఎక్కడ వున్నది? దేనిని ఆత్మయని మనము విశ్వసించాలి? ఈ సందేహము ప్రతి మానవునికి కలగటం సహజము. దీనికి చక్కని ప్రమాణము.

మానవునికి విజ్ఞానము పెరిగి, వివేకము నశించుటవల్లనే వేదమును విశ్వసించుట లేదు

ఈనాడు ఆదివారము. అక్టోబరు రెండవతేదీ అని మనము అంటున్నాము. ఎవరు చెప్పారు? 'నేను అక్టోబరు రెండవతేదీ' అని యేమైనా బోర్డు వ్రాసుకొని వస్తున్నాదా? ఎవరో సిద్ధాంతి వ్రాసిన కేలండరునో, పంచాగమునో ఆధారము చేసుకొని మనము దానిని అనుసరిస్తున్నాము. దానిని ఆధారము చేసుకొని మనము జీవితాన్ని గడుపుతున్నాము. అదేవిధముగా వేదము, శాస్త్రము 'యిది బ్రహ్మ', 'యిది ఆత్మ', అని ప్రజలకు బోధిస్తూ వస్తున్నాయి. మాసమునకు, తేదీకి మనము క్యేలండరును ఎంతగా విశ్వసిస్తున్నామో బ్రహ్మకు, ఆత్మకు వేదమును, శాస్త్రమును అంతగా విశ్వసించాలి. మనము నిత్యజీవితములో అనుభవించే ప్రతి ఒక్కటికూడా వేదప్రమాణమును బట్టే అనుసరిస్తున్నాము. 'జంతూనామ్ నరజన్మ దుర్లభమ్' అన్నది శృతి. జన్ అనగా జన్మించినటువంటిది. పులి, ఏనుగు, కుక్క, నక్క అని పేరు పెట్టినట్లుగానే ఈ మానవదేహమునకు మనిషి అని పేరుపెట్టారు. మానవునకు విజ్ఞానము పెరిగి, వివేకము నశించటమువలననే వేదమును విశ్వసించటం లేదు. ఆత్మ వున్నదనే సత్యము మాకు అక్కరలేదు అంటారు. ఆ వేదమే 'జంతూనాం నరజన్మదుర్లభమ్' అని చెప్పి 'మానవుడు ప్రత్యేకమైనవాడు', అని అన్నది. శృతి చెప్పినట్లుగా దేవుడు కలడనే వాక్యమును విశ్వసించని మానవుడు 'నేను మనిషిని' అన్న వాక్యమును ఎందుకు విశ్వసించాలి? తాను మనిషో, కాదో తనకేమి తెలుసు? తాను మనిషో, కుక్కో తనకేమి తెలుసు? నీకు అవసరమైన పదములను వేదమునుండి తీసుకొని నేను మనిషి అంటున్నావు. అదేరీతిగా దైవము వున్నాడనే విషయము కూడా ఎందుకు అంగీకరించకూడదు?

మనసే అన్నింటికి మూలకారణము

మానవుని భ్రమలే సందేహములకు, అపోహలకు కారణము. వైజ్ఞానికముగా కొన్ని

srisathyasaivachanamrutam

ప్రమాణములున్నవి. అద్దము మనముందు పెట్టుకొన్నప్పుడు ఆ mirrorలో మన ప్రతిబింబము మనకు కనబడుతుంది. అయితే ఈ ప్రతిబింబము అద్దములో వున్నదా? లేదు, లేదు. ఈ అద్దమునకు వెనుక పూసిన రసాయన ప్రభావమువలన మన దృష్టి దానిపై పడి అది మన ప్రతిబింబమును చూపుతున్నది. అది నీడ మాత్రమే! మన ప్రతిబింబము దానిలో లేదు. ప్రతిబింబమును చూచి అదియే సత్యమని భావిస్తున్నాము. ఇది సత్యము కాదు. ఇది విరుద్ధమైనది. ఎట్లనగా అద్దములో నీ ప్రతిబింబమును చూచినప్పుడు right eye, left eyeగా కనబడుతుంది. అది సత్యమని ఎట్లు చెప్పటానికి వీలవుతుంది? ఉన్నదానిని అది విరుద్ధముగా నిరూపిస్తున్నది. అదేవిధముగానే ఈ ప్రకృతి ఒక పెద్ద అద్దము. కానీ, అందులో కనిపించే విరుద్ధమైన స్వరూపాలను సత్యముగా భావిస్తున్నాము. అన్నీ భగవంతుని స్వరూపాలే! ఒకే భగవంతుడు అనేక రూపాలు ధరించాడు. అన్ని మతములు దీనినే అంగీకరిస్తున్నాయి. బైబిలు నందు God created man in his own image అని వున్నది. వేదమునందు కూడా 'ఏకోహం బహుస్యాం', అన్ని రూపములు నావే అని బోధిస్తూ వచ్చారు. సర్వము భగవత్ స్వరూపమని భావించు వ్యక్తులు భగవంతుని విస్మరించి, ప్రపంచానికి విరుద్ధమైన జీవితాన్ని గడుపుతున్నారు. మన యింద్రియములు వాటికి అవే పని చేస్తున్నాయని అనుకొంటున్నాము. విద్యార్థులారా! మనసే అన్నింటికి మూలకారణము.

మనస్సును వశము చేసుకుంటే సర్వేంద్రియములు మనకు వశమవుతాయి

మనస్సుయొక్క తత్వాన్ని మనము గుర్తించుకుంటే మహత్తరమైన తత్వము మనలో ఆవిర్భవిస్తుంది. నేత్రము మనకు ఒక యింద్రియముగా కనబడుతున్నది. నోరు ఒక యింద్రియముగా గోచరించుచున్నది. చెవి ఒక యింద్రియముగా కనిపిస్తున్నది. జాగ్రదవస్థలో కన్నులు చూస్తున్నాయి, నోరు మాట్లాడుతుంది, ముక్కు వాసన చూస్తుండాది. స్వప్నావస్థలో నేత్రముగాని, శ్రోత్రముగాని, ముక్కుగాని యేవీ కదలటం లేదు. అయితే, స్వప్నములో చూస్తున్నది ఏ నేత్రము? భయభ్రాంతులతో కూడిన శబ్దములను వింటున్నాము. ఆ శబ్దాలను యెవరు వింటున్నారు? స్వప్నములో అనేక రీతులుగా మాట్లాడుతున్నాము. ఏ జిహ్వా మాట్లాడుతున్నది? కాదు, కాదు. ఈ అన్ని స్వరూపములను ధరించేది మనసే! స్వప్నావస్థలోపల

sri sathyasai vahini amrutam

మనసే నేత్రమవుతుంది. మనసే జిహ్వ అవుతుంది. మనసే అన్ని ఆకారములను ధరిస్తుండాది. ఇంద్రియములు స్వప్నావస్థలో పని చేయటం లేదు. నీ పాదములు మెట్లపై పడివున్నాయి. నీవు అరణ్యములో ఎక్కడో నడుస్తున్నావు. ఆ పాదములు ఎవరివి? నీ పాదములు స్వప్నములో నడవటము లేదు. అక్కడ మనస్సే సర్వస్వరూపములను ధరిస్తున్నది. కనుకనే 'మనోమూల మిదం జగత్' అని అన్నారు. జగత్తంతా మనస్సుయొక్క స్వరూపమే. ఈ మనస్సును సక్రమమైన మార్గములో పెట్టినప్పుడు సర్వేంద్రియములు సులభముగా వశమైపోతాయి. కనుకనే మనస్సును మనము వశము చేసుకుంటే సర్వేంద్రియములు మనకు వశమవుతాయి. చెట్లవేళ్లకు మనము నీరుపోస్తే కొమ్మలకు, ఆకులకు అన్నింటికి ఆ నీరు చేరుతుంది.

పరబ్రహ్మము లేక పదార్థము వుండుటకు వీలుకాదు

మనస్సు అంటే ఏమిటి? ఇది కూడా భ్రాంతియే. ఈ భ్రాంతి మన కర్మల ద్వారా ప్రారంభమవుతుంది. మనము ఒక త్రాడును చూచాము. చిమ్మచీకటి కమ్మినప్పుడు అది పామేమోనని భయపడతావు. అయితే ఈ భ్రమకు, ఈ భయమునకు కారణమేమిటి? పూర్వము నీవు పామును, త్రాడును రెండింటినీ చూచావు. అందువల్లనే నీకు ఈ భయమేర్పడుతున్నది. ఈ త్రాడు పాములాగ కనబడుతున్నది. కనుక, యిది పామేనన్న భ్రాంతి ఏర్పడుతుంది. ఇది పాము అన్న భ్రాంతి వచ్చిన తక్షణమే భయమేర్పడుతుంది. భయము వచ్చేటప్పటికి దూరమైపోతున్నావు. టార్చిలైటు వేశావు. వేసిన వెంటనే యిది పాముకాదు అని తెలిసింది. అది త్రాడని తెలుసుకున్నావు, దానిని పారవేశావు. నీవు పామని భ్రమించినప్పుడు పాము అక్కడికి రాలేదు, అక్కడనుండి పోలేదు. లైట్ వేసిన తరువాత పాము పోలేదు, త్రాడు రాలేదు. అప్పుడు, యిప్పుడు వున్నది త్రాడు ఒక్కటే! రావటము, పోవటము నీ భ్రమయే! ఈ భ్రమ వుండినంతవరకు బ్రహ్మ అర్థము కాదు. భ్రమను మనము వదలాలి. దీనిని వదలాలి అంటే ఏమి కావాలి? మనకు విశ్వాసము కావాలి. పరబ్రహ్మములేక పదార్థము వుండుటకు వీలుకాదు. ఒక చిన్న ఉదాహరణము. కొడుకులు లేని తల్లితండ్రులు లోకములో వుండవచ్చును గాని తండ్రులులేని కొడుకులు వుండరు. చేపలు లేని జలము వుండవచ్చుగాని జలములేని చేపలు వుండుటకు వీలుకాదు. ప్రతిదానికి మూలాధారమైన పదార్థము లేక ప్రాకృతమైన పదార్థము

srisathyasaivachanamrutam

వుండుటకు వీలుకాదు. ఒకటి ఆధారము, రెండవది ఆధేయము. ఈ టేబుల్‌పైన ఈ టంబ్లరు వుంది. టేబుల్ ఆధారము. టంబ్లరు ఆధేయము. టేబుల్ లేకుండా టంబ్లరు పెట్టటానికి వీలులేదు. అన్నింటికి మూలాధారశక్తిని బ్రహ్మ అన్నారు, ఎనర్జీ అన్నారు, ఆత్మ అన్నారు. అది లేకుండా ఈ జగత్తు అనే పదార్థము వుండుటకు వీలుకాదు.

'మంచిని చెయ్యండి, మంచిగా ఉండండి, మంచినే చూడండి!'

విద్యార్థులారా! జగత్తుయొక్క సృష్టికి ఏది ఆధారమని మీరు యోచించవచ్చును. మొట్టమొదట స్వప్నమునకు కారణమేదో విచారించండి. కొంతమంది thoughts దీనికి కారణమంటారు. కొంతమంది దీనికి ఆహారమే కారణము అంటారు. కానీ ఏదీ సత్యము కాదు. దీనికి కారణము నిద్రయే. నిద్రలేక స్వప్నమేరాదు. అదేవిధంగా సృష్టికి ఏది కారణమంటే అజ్ఞానమే! ఇది ఎట్లు వస్తుండాది, ఎట్లు పోతుండాది. అప్పుడు, యిప్పుడు కూడా అవ్యక్తముగానే వుంటుండాది. ఎండాకాలములోపల భూమంతా ఎండి చాలా dryగా కనబడుతుంది. కానీ, వర్షము కురిసిన తక్షణమే పచ్చగా అయి మొక్కలు మొలవటము ప్రారంభమవుతుంది. ఇవి ఎక్కడనుండి వచ్చాయి? ఇవి పూర్వము అవ్యక్తమైన విత్తనరూపములో వుండేవి. ఆ అవ్యక్తమైన మొక్కలే లేకపోతే ఈ వ్యక్తమైన మొక్కలు రావటానికి వీలుకాదు. ఈ విత్తనములే కర్మ. మనము ఎటువంటి action చేస్తుంటామో దానికి reaction, resound తప్పినది కాదు. కనుకనే do good, be good, see good అని అన్నారు. మంచిగా చెయ్యండి. మంచిగా వుండండి. మనము పనులు చేస్తున్నప్పుడు ఫలితములను దృష్టిలో పెట్టుకోకుండా, తాత్కాలిక దృష్టితో పనులు చేస్తుంటాము. కాని రిజల్టు వచ్చినప్పుడు బాధపడతాము. నీవు భయపడినా లేక ఆనందించినా దాని ఫలితము తప్పినది కాదు. జలములోపల చక్కెర వేసుకొని 'యిది విషము, యిది విషము', అని త్రాగినా అది మంచే చేస్తుంది. అదే గ్లాసులో విషమువేసుకొని యిది చక్కెరపాకము, యిది చక్కెరపాకము అనుకుని త్రాగినా అది విషమై చంపేస్తుంది. మనము చెడ్డను 'మంచి, మంచి' అని అనుభవించినా అది చెడ్డ చేయక తప్పదు. మన భ్రాంతి కాదు, మన కర్మే దాని స్వరూపాన్ని నిరూపించాలి.

sri sathyasai vachanamrutam

మంచిగాని, చెడుగాని భగవంతునిపై బాధ్యత ఉంచి మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించాలి

ప్రతి మానవునకు మొట్టమొదట ఆచరణ అత్యవసరము. ఈ ఆచరణలోనికి మనశ్శక్తిద్వారా ప్రవేశించాలి. ఈ మనస్సు యింద్రియములతో కూడకుండ యేది చేసినా యిది దైవాజ్ఞ అనే భావముతో మనము మెలగాలి. ఎవరో నిన్ను తిడుతున్నారు. 'వాడెందుకు నన్ను తిడుతున్నాడు?' అని కోపము వస్తుంది. 'నా స్వామే, నా దైవమే నా దగ్గరకు వచ్చి నన్ను తిట్టి, నా దోషము పరిహారము చేస్తున్నాడు', అని అనుకో! ఎంత ఆనందముగా వుంటుంది! ఎవరో నిన్ను 'కుక్క, గాడిద' అని తిడతాడు. ఎందుకు బాధపడాలి? కుక్క, గాడిద అని తిట్టినప్పుడు నీకు నాలుగు కాళ్లుగాని, తోకగాని రాలేదు. లేనిదానిని మనము ఎందుకు నెత్తిని వేసుకోవాలి? ఈ విధమైన సహనాన్ని మనము లేత వయస్సునుండి అభివృద్ధి చేసుకోవాలి. మనను ఎవరేమన్నను చలించకూడదు, భ్రమించకూడదు. ఈ చలించటమూ, భ్రమించటమూ, దైవవిశ్వాసము సన్నగిల్లినప్పుడే జరుగుతాయి. తనపైన తనకు విశ్వాసము లేక, దైవముపైన విశ్వాసము లేనివాడే అనేక దుఃఖములకు, విచారములకు గురౌతాడు. యీనాటి మానవుడు అహంకారముతో విఱ్ఱవీగుతుంటాడు. వెర్రివాడై 'నేను చేశాను, నేను చేశాను' అని భ్రమిస్తున్నాడు. 'నేను చేశాను' అని భ్రమించినవాడు, దాని రిజల్టుకూడా తన కర్మఫలమే అని ఎందుకు భావించకూడదు? కర్మను ఆచరించే సమయములో మాత్రము 'నేను చేశాను', అంటాడు. ఫలితము చెడ్డగా వస్తే యిది నాది కాదంటాడు. కనుక మంచిగాని, చెడ్డగాని భగవంతునిమీద బాధ్యత వేసి మన కర్తవ్యాన్ని నిర్వర్తించటానికి ప్రయత్నించాలి.

పూవులెన్నొ తెచ్చి పూజలు చేసిన
మెచ్చబోడు తాను పుచ్చుకొనడు
హృదయ కమలమివ్వ సదయుడై గ్రహియించు
సత్యసాయి ప్రేమ శాంతిదాయి

మీ పువ్వులతో పూజను పరమాత్ముడు మెచ్చుకొనడు. అయితే మీ దగ్గర ఒక విశిష్టమైన పువ్వు వుంటున్నది. అది వాడేదీ, కూలేదీ, కాలేదీ, రాలేదీ కాదు. అదే హృదయ కమలము. ఈ హృదయకమలము జలములో వుంటున్నది. ఆ జలము ఏమిటి? అదే ప్రేమ జలము. ఈ

srisathyasaivachanamrutam

హృదయ కమలము, ఆ ప్రేమ జలము లేకపోతే ఒక్క క్షణకాలమైనా బ్రతకదు. రాధ చెప్పింది. ఎంతోకాలము ప్రేమ అనే జలములో 'కృష్ణా!' అనే నామజపంతో ఆ హృదయ కమలాన్ని కాపాడుకొంటూ వచ్చింది. "కృష్ణా! హృదయకమలాన్ని కాపాడుకోటంకోసము కంటిధారలను కాలువలుగా ప్రవహింపచేశాను. ఆ జలము కూడా ఇప్పుడు ఎండిపోయింది. 'ప్రేమ' అనే జలముతో కాపాడుకొంటూ వచ్చాను. అదీ ఎండిపోయింది. అందువలన నీవు యిచ్చిన దానిని నీకే అర్పితము గావిస్తాను" అని ప్రార్థించింది.

ఏ హృదయంబు నొసగితివో ఈశ నాకు
మగిడి దానినే యర్పింతు మహితమూర్తి
పరగ వేరేమి తెత్తు నీ పాదార్చనకు
అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు

ఈ హృదయమును నేను తీసుకొని రాలేదు. నీవే పెట్టి పంపించావు. ఈ monkey mindను నీవే యిచ్చి పంపించావు. ఇవన్నీ నీ ప్రసాదములే! ఈ అన్ని ప్రసాదములు నీకే అర్పిస్తున్నాను. ఈ పవిత్రమైన, పరిపూర్ణమైన భావాన్ని మనము అర్థము చేసుకుంటే జీవితము పరమశాంతముగా, సుఖముగా, ఆనందముగా అభివృద్ధి గావటానికి అవకాశము వుంటుంది. భగవంతుని శక్తే ఈ జగత్తు. భగవంతుడు ప్రత్యేకము కాదు. ఈ ప్రకృతిని పరమాత్మగా భావించి దానిని మనము చక్కగా, సద్వినియోగముగా అనుభవించాలి.

'ఇహమున సుఖింప హేమతారక విద్య, పరమున సుఖింప బ్రహ్మ విద్య'

విద్య. ఏది విద్య? కేవలము దేహము, యింద్రియములు, అంతఃకరణ యిత్యాది వాటిపై మనము భ్రమపెట్టుకొనటమువలన అజ్ఞానమనే విద్యను అభివృద్ధి గావించుకొంటున్నాము. అవి పనిముట్లేగాని అవి మనము కాదు. ఇది నా టవల్ అన్నప్పుడు ఆ టవల్ నేనౌతానా? టవల్ వేరు, నేను వేరు. My body అంటే body నేను కాదు. Body నాకంటె వేరుగావుంది. ఈనాటి విద్యార్థులు ఈ రకమైన సూత్రములను అభివృద్ధి చేసుకోవాలి. 'ఇహమున సుఖింప హేమతారక విద్య, పరమున సుఖింప బ్రహ్మ విద్య.' ఈ లౌకిక విద్యలు మనకు అవసరమే!

srisatyasaivachanamrutam

సందేహం లేదు. అయితే పారమార్థిక దృష్టితో, ప్రాకృతమైన జగత్తును అనుభవించాలి. ఇది ఈనాటి విద్యయొక్క అంతరార్థము. లౌకిక విద్యలు మనము వదలకూడదు. ప్రాకృతిక విద్యలన్నీ మనము ఆధ్యాత్మిక విద్యలో లయము గావించాలి. అప్పుడే యిది సార్థకమైన విద్యగా అభివృద్ధి పొందుతుంది. ప్రతి విద్యార్థికూడా ఆదర్శవంతమైన మూర్తిగా రూపొందాలి.

విద్య విజ్ఞానముకొరకు, కృషి కూటికొరకు

విద్యార్థులారా! మీరు కేవలము గొర్రె పిల్లలో, మేకపిల్లలో కాదు. మీరంతా పులి పిల్లలు, సింహపు పిల్లలు. మీరందరు దైవబిడ్డలని మీరు విశ్వసించాలి. అప్పుడే ఈ పవిత్రత మీలో ప్రవేశిస్తుంది. 'ఈ లేత వయస్సునందే దోషాలు చేస్తే, పెద్దవాడినైన తరువాత యింకా ఎన్ని దోషాలు చేస్తానో,' అనే విచారణ మీరు చేయాలి. మన దోషములు యెంత చిన్నవైనా వాటిని క్షమించకుండా శిక్షించటానికి పూనుకోవాలి. కానీ, ఈనాటి పిల్లల పరిస్థితి మారిపోయింది. ఏ దోషములు చేసినా వాటిని మీరు సమర్థించుకోటానికి ప్రయత్నిస్తున్నారు. దీనివలన మానవత్వము వ్యర్థమైపోతున్నది. సమర్థించరాదు. Self realisation యెంత ప్రధానమో Self punishment అంత ప్రధానము. మనము కనీసం సామాన్య మానవునిగానైనా బ్రతకటానికి ప్రయత్నించాలి. ఇలాంటి పరిస్థితులలో విద్య మనకు ఏ విధముగాను తోడ్పడదు. విద్యయొక్క విశిష్టతను మన ప్రవర్తనతో నిరూపించాలి.

విద్యార్థులారా! ముఖ్యముగా 'మనము ఏమి చేస్తున్నాము, ఏమి చదువుతున్నాము, ఏ విధముగా పాటుపడుతున్నాము' అనే ప్రశ్న వేసుకోటం లేదు. చదువైన తరువాత ఉద్యోగము చిక్కాలి, అని ఉద్యోగలక్ష్యముతో మనము చదువుతున్నాము. ఉద్యోగమునకు, చదువుకు యేమాత్రము సంబంధము లేదు. విద్య విజ్ఞానము కోసం, కృషి కూటి కోసం. లక్షరూపాయలను చేతిలో పెట్టుకొని ఆకలి తీర్చమంటే అది ఆకలి తీర్చలేదు. అన్నమే ఆకలి తీరుస్తుంది. నిజమైన health, నిజమైన wealth మన ఆనందమే! ఈ ఆనందము ఆధ్యాత్మికములో తప్ప అన్యమార్గములో మనకు యేమాత్రము లభించదు.

భగవంతుని ధనముతో కొనటానికి సాధ్యము కాదు

ఆధ్యాత్మికమంటే ఏమిటి? ఆధ్యాత్మికముతో మనము ఆత్మవిశ్వాసమును పెంచుకోవాలి.

srisathyasaivachanamrutam

దైవానికి సర్వము అర్పితము గావించాలి. మీకు తెలుసు కృష్ణ తులాభారము డ్రామా గురించి. ఈ కృష్ణతులాభారమునకు కారణమేమిటి? సత్యభామకు కృష్ణుని తనవాడుగా చేసుకోవాలని వాంఛ. కృష్ణుడు ఈమె అహంకారమును, స్వార్థమును రూపుమాపాలని నిశ్చయించుకున్నాడు. నారదుడు ప్రవేశించి 'అమ్మా! నీవు కృష్ణుని పొందాలనుకుంటే అతన్ని నీవు ఎవరికైనా దానమిచ్చి అంత ధనమును యిచ్చి నీవు అతన్ని తీసుకోవచ్చ'ని చెప్పాడు. అప్పుడు సత్యభామ 'నారదా! తరువాత కృష్ణుడు నన్ను వదలిపోడు కదా!' అని నారదునినుండి వాగ్దానము తీసుకున్నది. ఆమెలో అంత స్వార్థము వుంది. అతన్ని తూచి తాను తెచ్చుకోగలను, అన్న అహంకారముకూడా వుంది. ఆ పని చేసింది. త్రాసులో ఒక వైపున కృష్ణుని కూర్చోపెట్టింది. మరొకదానిలో తనకున్న నగలు, ధనకనకములు, వజ్రవైఢూర్య మణిమాణిక్యములు పుష్యరాగములను వేసింది. శమంతక మణినికూడా వేసింది. పాపం కృష్ణుడు అణుమాత్రమైన కదలలేదు. దీని అంతరార్థమేమిటి? భగవంతుని ధనముతో కొనటానికి సాధ్యముకాదు. అహంకారముతో అతనిని పొందటానికి వీలుకాదు. 'వజ్ర మాణిక్య మరకత గోమేధిక పుష్యరాగములు భగవంతునితో సమానము కావు', అనే సత్యాన్ని లోకానికి చాటటమే కృష్ణతులాభారముయొక్క అంతరార్థము. అయితే దేనికతడు వశమవుతాడు? రుక్మిణి వచ్చింది. ఆమె నిరహంకారి, నిస్వార్థపరురాలు. సత్యభామ రుక్మిణివద్దకు వచ్చినప్పుడు ఆమె తులసి పూజ చేసుకొంటున్నది. తులసి దళమును త్రుంచి, తన నోటిలో వేసుకోటం ఆమెకు అలవాటు. సత్యభామ తొందరను చూచి, ఆమె ఆ దళమును నోటిలో వేసుకొనక చేతిలోనే పెట్టుకొని వచ్చింది. సత్యభామ నోరువిప్పి అంతా వివరించింది. 'అయ్యో అవివేకురాలా! మన కృష్ణుడు ధనముతో తూగుతాడా? చాలా పొరబడుతున్నావు' అని చెప్పి తులసిదళమును చేతిలో పట్టుకొన్నది. 'పత్రమో, పుష్పమో, ఫలమో, తోయమో భక్తి కలిగినవారికి వశుడవగుట సత్యమైన నీవు ఈ తులసిదళమునకు తూగుదువుగాక!' అని తులసిదళమును తీసి 'హా! కృష్ణా!' అంటూ తులసిదళము త్రాసులో వేసింది. కృష్ణ రూపమునకు కృష్ణనామమే సరియైన తూకము! 'కృష్ణా' అని తులసీ దళమును వేయటం వలన కృష్ణనామము కృష్ణరూపమును తూచింది. తులసిదళము extra weight అయిపోయింది. పత్రమో, పుష్పమో, ఫలమో, తోయమో అంటే ఏమిటి? మనము పూజచేస్తున్నప్పుడు పత్రమన్నప్పుడు మారేడు పత్రమో, జాజిపత్రమో తీసుకొని వేస్తున్నాము. పుష్పమన్నప్పుడు మల్లెపువ్వో, సంపెంగ పువ్వో

sri sathyasai vahini

వేస్తున్నాము. ఫలమన్నప్పుడు అరటిపండో, ఆపిల్‌పండో పెట్టి కొంచెము గిల్లి అర్పించి చివరకు మనమే తింటున్నాము. తోయమంటే జలము. నూతినుండిగాని, tap నుండిగాని తీసి అర్పిస్తున్నాము. ఇదికాదు, రుక్మిణిదేవి భావము. "పత్రమనగా దేహపత్రము. దీనినే నీకు అర్పిస్తున్నాను; పుష్పమనగా హృదయ పుష్పము. నా హృదయ పుష్పమును నీకు అర్పిస్తున్నాను. ఫలమనగా మనోఫలము. తోయమనగా ఆనందబాష్పములు. నీవు యిచ్చినది నీకే యిస్తున్నాను. ఈ హృదయ పుష్పాన్ని నేను తీసుకొని రాలేదు. ఈ దేహమనే పత్రాన్ని నేను తీసుకొని రాలేదు. ప్రతి ఒక్కటి నీ gift. అది నీకు యిస్తున్నాను" అని ఈ విధమైన పవిత్ర భావములతో రుక్మిణి సర్వస్వమూ అర్పించింది భగవంతునికి. 'పరమాత్మని వశము చేసుకోటానికి ప్రేమతత్త్వము ఒక్కటే సాధనము,' అని పరమభక్తులు లోకానికి చాటుతూ వచ్చారు. పరమాత్ముని పొందటానికి ప్రేమ ప్రధానము. అన్నీ అక్కడనుండే వచ్చాయి. అన్నీ అక్కడికే చేరిపోవాలి. మనము బ్రహ్మనుండి వచ్చినవారము. బ్రహ్మభావముతోనే వుండాలి. బ్రహ్మ తలంపులే రావాలి. అనగా పవిత్రమైన తలంపులే వుండాలి. పవిత్రమైన చర్యలు వుండాలి. పవిత్రమైన దృష్టి ఉండాలి. ఐకమత్యము అభివృద్ధి గావించుకోవాలి. వీటినన్నింటిని జయదేవుడు చక్కగా బోధించాడు.

జిహ్వే రసజ్ఞే మధుర ప్రియేత్వం సత్యం హితం త్వాం పరమం వదామి
ఆవర్ణయేథా మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి

"ఓ నాలుకా! రసమెరిగినా నాలుకా! మధురమైన నాలుకా! నీకు ఏమి బోధించాలి? నీ సహనము, నీవుచేసిన త్యాగము, నీ ఔదార్యము, నీ గౌరవము నీకే సాటిగాని అన్యులకు సాటిగాదు. నాలుకా! నీవు చాలా శాంతపరురాలవు. నీవు చాలా సున్నితంగా, జాగ్రత్తగా నడుచుకుంటున్నావు. ఈ ప్రపంచములో నేను వుంటున్నాను. నేను అందరివలన భయపడుతున్నాను. రాక్షసులమధ్య వుండికూడా నీవు ఎంత శాంతముగా, ఎంత జాగ్రత్తగా మెలగుతున్నావు! నీ జాగ్రత్త మానవులకే వుండివుంటే ఎంత తరించి వుండేవారు!" నీ త్యాగము చూస్తామా అంటే, ఏదైనా మధుర పదార్థములు నీకు పెట్టినప్పుడు యిది మధురముగా వున్నది ఓ జఠరాగ్ని నీవు తీసుకో నీవే పుట్టించావని జఠరమునకు యిచ్చేస్తుంది. ఇంకా యిది తన గౌరవమును యేవిధముగా కాపాడుకొంటుంది? తన స్థానములో మాత్రమే తానుండి తన

srisathyasaivahini.com

కర్తవ్యకర్మలన్నీ చక్కగా ఆచరిస్తుంది. ఈనాటి పిల్లలు పిల్లులవలె, ఎలుకలవలె అటు, ఇటు తిరుగుతారు. నేను గంటసేపు మాట్లాడినా నా నాలుక బయటకు రాదు. అది చాలా గౌరవముగా బ్రతుకుతుంది. ఇది చెడ్డపని చేసినవానిని నిందిస్తుంది. మంచిపని చేసిన వానిని వర్ణిస్తుంది. మంచివానిని చూచి 'నీవు దేవుడంతటి వాడవయ్యా!' అని వర్ణిస్తుంది. చెడ్డపనులు చూసి 'పశువా!' అని నిందిస్తుంది. ఎంతో న్యాయంతో వుంటుంది. అందువలనే జయదేవుడు హితము చెప్పాడు. ఏమిటా హితము? 'గోవిందా, దామోదరా, మాధవా అని భగవన్నామము చేయు'మని చెప్పాడు. ఈనాడు మన నాలుకను వారిని, వీరిని నిందించటానికి వుపయోగిస్తున్నాము. వారిని, వీరిని హేళన చేయటంలో మనము ప్రవేశపెడుతున్నాము. మన కన్నులు చూస్తామా అంటే మనకంటె కాకి మేలు. చెడ్డను చూడటానికి మన కన్నులను concentrate చేస్తుంటాము. మంచిని చూడటానికి వాటిని వుపయోగించము. కాలేజీకి సైకిల్ మీద పోతూ తన దారిలో ఏమి వస్తున్నదో చూడడు. గోడమీదనున్న వాల్‌పోస్టర్లు చూస్తుంటాడు. ఇంతలో ఒక రిక్షా యితన్ని కొట్టేస్తుంది. అక్కడికి నీ దృష్టి ఎందుకు పోవాలి? నీవు రోడ్డును చూచుకొనిపో. నీ దృష్టిని దుర్వినియోగము చేస్తున్నావు. దీనికే 'కాకి దృష్టి' అనిపేరు. కాకి అయినా మేలు. సుఖము వచ్చినా దుఃఖము వచ్చినా 'కావు, కావు'మని అరుస్తుంది. 'కావు' అంటే 'ఓ భగవంతుడా! కావు!' అంటుంది. మనిషి అదికూడా చెప్పడు. కాకి వచ్చి గోడమీద వాలుతుంది. ఒక్క క్షణముకూడా దానిదృష్టి స్థిరముగా వుండదు. మన చూపులుకూడా యిలాగే వుంటుంటాయి. మనము యితరుల ముఖాలు, యితరుల వేషాలు చూస్తుంటాముగాని మన కర్తవ్యమేమిటో మనము గుర్తించాలన్న విశాలభావము మనకురాదు. మీరందరు క్రొత్తవారుగా వుంటున్నారు కనుక ఈ విషయములను మీకు తెలుపవలసి వస్తున్నది. చెవులను సృష్టించే సమయములో దానికి మూతలు పెట్టలేదు. ముక్కుకు కూడా మూతలు పెట్టలేదు. ఒక్క కన్నులకు, నోటికి మాత్రమే మూతలు పెట్టారు. కారణమేమిటి? ఆ రెండు జాగ్రత్తగా ఉపయోగించాలి. Bad look వచ్చిందంటే కన్నులను మూసుకో. కోపమో రౌద్రమో వచ్చినప్పుడు నీ నోటిని మూసిపెట్టు. Bad talk మనిషిని bad manగా మారుస్తుంది. ఈ రెండు లేకుండా చూచుకోండి. ఈ రెండు మానవుని ఉన్నత స్థానమునకు గొనిపోయే రెండు చక్రములవంటివి. రెండు రెక్కల వంటివి. ఈ రెండూ లేకున్న, మానవునిలో యేదోషములు వుండటానికి వీలులేదు. భగవంతుని తత్త్వము

sri sathyasai vahini amrutam

ఎల్లప్పుడు పవిత్రముగా వుంటుంది.

మీరందరు మందహాసముతో జీవించాలి

మీరందరు మందహాసముతో జీవించాలి. మీ హృదయములు ఆనందముతో చిందులాడాలి. ఇక్కడ మీకు ఏమి తక్కువగా వుందని? నయాపైస ఖర్చుపెట్టకుండా, కాలు గడపదాటకుండా కైవల్యము వడిలో పడుతున్నాది. ఇలాంటి సమయములోపల ఎందుకు మీరు castor oil face వేసుకోవాలి? castor oil త్రాగినవారిలా వుంటుంటారు. కర్తవ్యము చేయనివారికే castor oil face. కొంతమంది examination అంటే భయపడతారు. examination తప్పక వుండాలి. నీవు బాగా చదివివుంటే examination గురించి భయపడనక్కరలేదే! examinations ఎప్పుడెప్పుడు వస్తావుంటాయని వూ[రూతలూగుతుండాలి. examination ఎంత త్వరగావస్తే అంత త్వరగా మనము పాస్ అయిపోతాము. కానీ, పిల్లలు ఈ విషయము సరిగా గుర్తించుకోటం లేదు. Examinations వచ్చేకొలది ఆనందమును అభివృద్ధి పరచుకోవాలి. మనము late చేసేకొలది మన time waste అయిపోతుంది. కనుక మనము examinations సమయములో ఆనందముతో వుండాలి. చెట్లకు పువ్వులు వుంటుంటాయి. వాటి దళములు విచ్చేసరికి సుగంధము వస్తుంది. రాలిపోయేముందు పరిపూర్ణమైన పువ్వుగా క్రిందపడిపోతుంది. ఈ పరీక్షలు వచ్చేకొలది మన ముఖములు విచ్చినట్లుగా వుండాలి. అట్లుకాకుండా Stomach ache, head ache అని ఈ aches తో వుండకూడదు.

నీ కర్తవ్యాన్ని నీవు చక్కగా నిర్వర్తించు

Happiness is union with God. పిల్లలు మేము fail అయిపోతామన్న మాటకు యేమాత్రము అవకాశము యివ్వరాదు. నీ కర్తవ్యమును నీవు చక్కగా నిర్వర్తించు, నీవు pass అవుతావు. నీవు fail అయినప్పుడు ఆ మాష్టరుది తప్పు, యితనిది తప్పు అని వారిపై తప్పు వేస్తున్నావు. 'ఇది నాదే తప్పు,' అని తనకు తానే అనుకోవాలి. నీవు చక్కగా చదివితే ఎందుకు పాస్ కావు? నీ కర్తవ్యాన్ని నీవు చక్కగా నిర్వర్తించు. విద్యార్థిగావున్నప్పుడు విద్యార్థి ధర్మాన్ని చక్కగా నిర్వర్తించు. గృహస్థుగా వున్నప్పుడు గృహస్థు ధర్మాన్ని చక్కగా నిర్వర్తించు. మనము

srisathyasaivachanamrutam

యే స్థానములో వుంటామో దానికి తగినట్లుగా మనము ప్రవర్తించాలి. అన్నింటికిని భగవంతుని ఆధారము తీసుకోవాలి. మంచి భావములను అభివృద్ధిపరచుకోవాలి. ఏ ఒక్కటి జరిగినా తనలోతాను compare చేసుకోవాలి. పిల్లలలో యిది చాలా అవసరము. మనము ఎవరినైనా బాధపెడితే, ఈ బాధ మనకు యితరులు పెడితే యెంత కష్టముగా వుంటుంది, అని మనము ఆలోచించాలి. దీనినే భూజాతయైన సీత రావణునకు బోధించింది. రావణుడు వచ్చి శ్రీరామచంద్రుని విమర్శించాడు "నేను చాలా అందముగా వున్నాను. గొప్ప రాజును. వైకుంఠమునకు మించిన సౌకర్యములు సమకూరుస్తాను. నన్ను వరించు" అని కోరాడు. అప్పుడు సీత చెప్పింది "రావణా! నీ పత్ని మండోదరిని మరొక పురుషుడు అపహరిస్తే నీవు ఏరీతిగా వుంటావు? నీవు నన్ను అపహరించటంచేత నాపతి వియోగముతో బాధపడుతున్నాడు. నిన్ను నీవు ఉదాహరణగా తీసుకో. నీ భార్యను ఎవరైనా తీసుకొనిపోతే నీవు శాంతముగా వుంటావా?" అని. మనము యితరులపై చెడుదృష్టి వుంచినప్పుడు మనపై యితరుల చెడ్డదృష్టి పడుతుంది. 'నా వారిపై, నా Sistersపై చెడ్డదృష్టి పడినప్పుడు నేను వూరుకుంటానా, ఇది తప్పు,' అని సరిదిద్దుకోవాలి. ఇలాంటి examples లోపల మన విద్యార్థులు చక్కగా అభివృద్ధి కావాలి.

హృదయమనే పాత్రలో భగవత్ప్రేమ అనే మధుర రసమును నింపుకో!

ఈనాడు మనకు కావలసినది good behaviour, good manners, good discipline. యివన్నీ వున్నప్పుడే good life వస్తుంది. కానీ, ఈనాడు మనము దానిని విశ్వసించకుండా వున్నాము. Manners కలిగినవాడే Man. Manners అంటే ఏమిటి? మన thoughts, words, actions ఏకముకావాలి. The proper study of mankind is man. మొట్టమొదట పద్యమునందు చెప్పాను 'మనసునందు మంచి, మాటయందు మంచి, నడతయందు మంచి' ఇవే మన జీవితాన్ని చక్కగా తీర్చిదిద్దుతాయి. మాటలందున తీపి, మనసునందు చేదు మంచిది కాదు. ఈనాడు మనవారి మాటలు స్వీట్‌గా వుంటాయి. కాని mind చూస్తే bitterగా వుంటుంది. Mindను స్వీట్ చేసుకోవాలి. అప్పుడే నీ దృష్టి sweet, శ్రవణము sweet, హృదయం sweet, అన్నీ స్వీట్‌గానే రూపొందుతాయి. మనము ఈ టంబ్లరులో జ్యూస్‌పోసి దానికి యేచోట

sri sathyasai vahamrutam

రంధ్రము పెట్టినా ఆ రంధ్రమునుండి జ్యూసే వస్తుంది. హృదయమనే పాత్రలోపల భగవత్ ప్రేమ అనే జ్యూస్ నింపుకో. నీ actions, నీ looks, నీ words అన్నీ తీయగానే వస్తాయి.

కనుక, విద్యార్థులు విద్యతోబాటు భగవత్ప్రేమను, విశాలహృదయాన్ని పెంచుకొని స్వార్థము, అహంకారము, ఆడంబరములనేవానిని అణగద్రొక్కి, ఆదర్శప్రాయులుగా జీవించాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

(తేదీ. 02-10-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)

sri sathyasai vachanamrutam